క్లుప్తంగా

పారదర్శకంగా భూముల రీ సర్వే

కంచికచర్ల: మండలంలోని పేరకలపాడు, పెండ్యాల, సైదాపురం, కీసర, గండేపల్లి, వేములపల్లి గ్రామాల్లో గురువారం రెవెన్యూ అధికారులు భూముల రీ సర్వే నిర్వహించారు. తహసీల్దార్ శంకరబాబు ఈ సందర్భంగా మాట్లాడుతూ.. భూముల రీసర్వే పనులను పారదర్శకంగా చేయాలని ఆదేశించారు. కచ్చితమైన కొలతలు, హద్దులు వచ్చేలా చూడాలన్నారు. రీ సర్వేకు భూముల యజమానులు సహకరించాలని కోరారు. ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. మండల సర్వేయర్ బసవరావు, గ్రామ సహాయ సర్వేయర్లు పాల్గొన్నారు.

శ్రీలక్ష్మీపేరంటాళ్ల అమ్మవారి తిరునాళ్ల నేటి నుంచి



నందిగామ: మండలంలోని లింగాలపాడు గ్రామంలో వేంచేసియున్న శ్రీలక్ష్మీ పేరంటాళ్ల అమ్మవారి తిరునాళ్ల మహోత్సవాలు శుక్రవారం నుంచి ఘనంగా జరగనున్నాయి. ఈ నెల 10వ తేదీ వరకు తిరునాళ్ల మహోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు చేశారు. ఆరు రోజుల పాటు విశేష పూజలు, రథోత్సవం, గ్రామశిలల బోనాలు, అమ్మవారికి గ్రామ బోనాలు, దీవెన బండారు కార్యక్రమాలతో పాటు నిత్యం సాంస్కృతిక కార్యక్రమాలు జరగనున్నాయి.

హెచ్ఐవీ బాధిత చిన్నారుల కోసం కేసీపీ ఆర్థిక సాయం



జగ్గయ్యపేట అర్బన్: హెచ్ఐవీ బాధిత చిన్నారులకు పౌష్టికాహారం నిమిత్తం స్వచ్ఛంద సంస్థ లెప్రా సొసైటీ బాధ్యులకు కేసీపీ సిమెంట్స్ ప్రతినిధులు గురువారం రూ.1,60,860 ఆర్థిక సాయం చేశారు. పట్టణంలో జరిగిన ఈ కార్యక్రమంలో కేసీపీ సంస్థ వైస్ ప్రెసిడెంట్ మధుసూదనరావు మాట్లాడుతూ.. సేవా కార్యక్రమాల్లో కేసీపీ ముందు ఉంటుందన్నారు. లెప్రా సొసైటీ కోఆర్డినేటర్ రాధిక మాట్లాడుతూ.. కేసీపీ ఆర్థిక సాయంతో జగ్గయ్యపేట, వత్సవాయి మండలాల్లో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేసీపీ సంస్థ సీఎస్ఆర్ హెడ్ రాఘవేంద్రరావు మాట్లాడుతూ.. హెచ్ఐవీతో బాధపడుతున్న చిన్నారులకు పౌష్టికాహారం అవసరమన్నారు. లెప్రా సొసైటీ అసోసియేట్ ఎ.వి.బాషా, శ్రేయస్సు సంస్థ ప్రెసిడెంట్ గుండా అనురాధ తదితరులు పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు కౌన్సెలింగ్



నందిగామ: ఆటోలను నిబంధనల ప్రకారమే నడపాలని పోలీస్ ఇన్‌స్పెక్టర్ సతీష్ సూచించారు. పట్టణంలోని చందర్లపాడు బస్టాండ్ ప్రాంతంలో ఉన్న ఆటో స్టాండ్‌లో డ్రైవర్లకు గురువారం కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా సతీష్ మాట్లాడుతూ.. ఆటో డ్రైవర్లకు తప్పనిసరిగా లైసెన్సు ఉండాలన్నారు. నిబంధనల ప్రకారమే ఆటోలను నడపాలని సూచించారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రయాణికులతో మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని సూచించారు. లౌడ్ స్పీకర్లు పెట్టుకొని ఆటో నడిపితే సీజ్ చేస్తామన్నారు. ఎస్ఐ పండు దొర, సిబ్బంది పాల్గొన్నారు.

సచివాలయంలో ఆకస్మిక తనిఖీలు



నందిగామ: సచివాలయానికి వచ్చిన వారితో సిబ్బంది మర్యాదపూర్వకంగా నడుచుకోవాలని మునిసిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం సూచించారు. పట్టణంలోని మూడో సచివాలయాన్ని ఆయన గురువారం ఆకస్మికంగా తనిఖీలు చేశారు. సచివాలయంలో సిబ్బంది మూమెంట్ రిజిస్టర్, సంక్షేమ పథకాల జాబితాలను పరిశీలించారు. అనంతరం సచివాలయానికి వచ్చే వారితో మాట్లాడారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. సచివాలయ సిబ్బంది సమయపాలన పాటించడంతో పాటు సచివాలయానికి వచ్చే వారితో మర్యాదపూర్వకంగా నడుచుకోవాలన్నారు. సచివాలయం ద్వారా ప్రజలకు సేవలను సకాలంలో అందేలా చూడాలన్నారు. విధి నిర్వహణలో అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదన్నారు. ప్రతి ఒక్కరు తప్పనిసరిగా మూమెంట్ రిజిస్టర్‌ను అనుసరించాలని సూచించారు.

గడప గడపకూ సగర్వంగా..

ఎమ్మెల్యే మొండితోక జగన్‌మోహనరావు

నందిగామ టౌన్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న సంక్షేమ పాలనతో గడప గడపకూ సగర్వంగా వెళ్లగలుగుతున్నామని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. చందర్లపాడు మండలం కొడవటికల్లు గ్రామంలో గురువారం రాత్రి ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించారు. సంక్షేమ పథకాల క్యాలెండర్‌ను ప్రజలకు అందజేశారు. ఈ సందదర్భంగా జగన్‌మోహనరావు.. మాట్లాడుతూ వలంటీర్, గ్రామ/వార్డు సచివాలయ వ్యవస్థతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల ఇళ్ల ముంగిటకే పాలన తీసుకొచ్చారని పేర్కొన్నారు. అర్హతే ప్రామాణికంగా, పార్టీలు, రాజకీయాలు, కులమతాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అందించి ప్రతి ఒక్కరి జీవితాల్లో వెలుగులు నింపారని కొనియాడారు. ముఖ్యమంత్రి సంక్షేమ పాలనతో ఏ ఇంటికెళ్లినా ఆప్యాయంగా పలకరించటంతో పాటు సొంత బిడ్డలా అక్కున చేర్చుకుంటున్నారని వివరించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నాలుగేళ్ల పాలనలో ప్రతి కుటుంబానికీ లబ్ధి చేకూర్చారని, వచ్చే ఎన్నికల్లో ప్రజలు అండగా నిలిచి ఆశీర్వదించి మరింత మంచి చేసేందుకు అవకాశమివ్వాలని కోరారు. సర్పంచ్ చావల రవిబాబు, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కందుల నాగేశ్వరరావు, నాయకులు యార్లగడ్డ సత్యనారాయణ ప్రసాద్, జంపాని నాగేశ్వరరావు, వేగినీడి సుబ్బారావు, శ్రీనివాసరావు, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



కొడవటికల్లు గడపగడపలో సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

ప్రజలందరి నమ్మకం వైఎస్ జగన్

చట్టన్నవరం(వీరులపాడు): నాలుగేళ్ల పాలనలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించి వారి జీవితాల్లో వెలుగులు నింపిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రజల నమ్మకంగా నిలిచారని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు అన్నారు. మండలంలోని చట్టన్నవరం గ్రామంలో గురువారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు గ్రామంలోని గడప గడపకు వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలను వివరించి, వారి సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పాలనకు ప్రజల నుంచి విశేష స్పందన వస్తోందన్న విషయం ఇటీవల నిర్వహించిన 'మా నమ్మకం నువ్వే జగన్' కార్యక్రమం ద్వారా నిర్వహించిన పీపుల్స్ మెగా సర్వేలో తేటతెల్లమైందని తెలిపారు. ప్రజలకు నిత్యం మంచి చేస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వానికి అండగా నిలిచి వచ్చే ఎన్నికల్లో ఆశీర్వదించాలని కోరారు. ఎంపీపీ కోటేరు లక్ష్మి, జెడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తి సౌజన్య, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, సర్పంచ్ చలమాల దుర్గారావు, పీఏసీఎస్ చైర్మన్‌కోట రామారావు, పార్టీ మండల రైతు విభాగం కన్వీనర్ మట్టూరి సాయిబాబు తదితరులు పాల్గొన్నారు.



చట్టన్నవరం గడపగడపలో సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

పారిశుద్ధ్యం మెరుగుదలకు సహకరించాలి

నందిగామ: పట్టణాన్ని పరిశుభ్రంగా ఉంచడంలో ప్రజలు పూర్తి సహాయ సహకారాలు అందజేయాలని మునిసిపల్ కమిషనర్ డాక్టర్ జయరాం కోరారు. పట్టణంలోని 9వ వార్డులో ఆయన గురువారం పర్యటించి పారిశుద్ధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. పారిశుద్ధ్య పనుల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. డ్రెయిన్లలో పూడిక తీత, పిచ్చి మొక్కల తొలగింపు, బ్లీచింగ్ చల్లించడం, ఫాగింగ్ తదితర కార్యక్రమాలు ముమ్మరంగా నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ప్రజలు కూడా సహకరిస్తే నందిగామను స్వచ్ఛంగా, ఆదర్శంగా తీర్చిదిద్దొచ్చని పేర్కొన్నారు. దేవేందర్ రెడ్డి, కృష్ణారావు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.



పారిశుద్ధ్య పనులను పర్యవేక్షిస్తున్న కమిషనర్ డాక్టర్ జయరాం

శాంతిభద్రతల పరిరక్షణకు కృషి



ఇబ్రహీంపట్నం: విజయవాడ కొత్తపేట పోలీస్ స్టేషన్ నుంచి బదిలీపై వచ్చిన ఎస్ఐ విజయలక్ష్మి ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్‌లో గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే వసంత కృష్ణప్రసాద్‌ను ఐతవరంలోని ఆయన స్వగృహంలో మర్యాదపూర్వకంగా కలిశారు. పూలమొక్క అందజేశారు. శాంతిభద్రతల పరిరక్షణకు నిరంతరం కృషి చేస్తానని ఈ సందర్భంగా ఎస్ఐ విజయలక్ష్మి చెప్పారు. ఇప్పటి వరకు ఇక్కడ పనిచేసిన ఎస్ఐ ఎస్.శ్రీనివాస్ రెడ్డిగూడెం ఎస్‌హెచ్‌ఓగా బదిలీపై వెళ్లారు. స్టేషన్ సీఐ పి.శ్రీను, సిబ్బంది ఎస్ఐ విజయలక్ష్మికి అభినందనలు తెలిపారు.

గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలి

ఆర్డీఓ రవీంద్రరావు

నందిగామ: జగనన్న కాలనీల్లో చేపట్టిన గృహ నిర్మాణాలు త్వరితగతిన పూర్తయ్యేలా ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆర్డీఓ రవీంద్రరావు సూచించారు. పట్టణంలోని తన కార్యాలయంలో రెవెన్యూ డివిజన్ పరిధిలోని గృహ నిర్మాణ శాఖ అధికారులు, సిబ్బందితో ఆయన గురువారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డివిజన్ పరిధిలో జగనన్న కాలనీలలో గృహ నిర్మాణాలకు సంబంధించిన పురోగతిపై సమీక్షించారు. అనంతరం పలు సూచనలు చేశారు. జగనన్న కాలనీలలో గృహ నిర్మాణాలు త్వరితగతిన పూర్తయ్యేలా చూడాలని ఆదేశించారు. గృహ నిర్మాణ శాఖ డీఈలు, ఏఈలు, డివిజన్ పరిధిలోని అన్ని గ్రామాల ఇంజినీరింగ్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న ఆర్డీఓ రవీంద్రరావు

వైభవంగా శ్రీవారి విగ్రహ ప్రతిష్ట



నూతనంగా ప్రతిష్ఠించిన స్వామి వారి విగ్రహాలు

నందిగామ(చందర్లపాడు): చందర్లపాడు మండలంలోని చింతలపాడు గ్రామంలో నూతనంగా నిర్మించిన అలివేలు మంగ, పద్మావతి సమేత వెంకటేశ్వర స్వామి వారి ఆలయ ప్రతిష్ఠ మహోత్సవాలు గురువారం వైభవంగా జరిగాయి. గ్రామంలో తిరుమల తిరుపతి దేవస్థానం, శ్రీవాణి ట్రస్ట్ సౌజన్యంతో నిర్మించిన ఆలయంలో స్వామివారు, అమ్మవార్ల విగ్రహాలతో పాటు పరివార దేవతలు, జీవ ధ్వజ స్తంభ ప్రతిష్ఠ కార్యక్రమం వేద పండితులు యనమదల రాజేష్ శర్మ, దాములూరు శ్రీనివాస్ శర్మ పర్యవేక్షణలో వైభవంగా జరిగింది. ఉదయం 7.16 గంటలకు వేద పండితుల మంత్రాల నడుమ యంత్ర స్థాపన నిర్వహించారు. అనంతరం శ్రీవారి శాంతి కల్యాణాన్ని జరిపించారు. అనంతరం భక్తులకు అన్నసంతర్పణ చేశారు. ఈ వేడుకల్లో ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహన్‌రావు పాల్గొన్నారు. ఆ తర్వాత గ్రామంలో వేలాది మంది భక్తులతో శోభాయాత్ర నిర్వహించారు.



ప్రతిష్ఠా మహోత్సవ పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహన్‌రావు

వేసవి శిక్షణ శిబిరాలతో విజ్ఞానం

తిరువూరు: విద్యార్థులు వేసవిలో తమ అభిరుచికి అనుగుణంగా నైపుణ్యాలు పెంపొందించుకోడానికి అవసరమైన శిక్షణ పొందాలని జనవిజ్ఞాన వేదిక జిల్లా గౌరవాధ్యక్షుడు డాక్టర్ వల్లభనేని రవీంద్ర తెలిపారు. స్థానిక బోస్ సెంటర్‌లో జనవిజ్ఞాన వేదిక ఏర్పాటు చేయనున్న వేసవి శిక్షణా శిబిర ప్రచార కరపత్రాలను గురువారం ఆవిష్కరించారు. ఈ నెల ఐదో తేదీ నుంచి స్పోకెన్ ఇంగ్లిషు, ఇంద్రజాల ప్రదర్శనల్లో ఉచిత శిక్షణను జనవిజ్ఞాన వేదిక ఏర్పాటు చేసిందని, వీటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని రవీంద్ర సూచించారు. జేవీవీ ప్రతినిధులు రాంప్రదీప్, బి.వెంకటేశ్వరరావు, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

గ్రంథాలయంలో వేసవి శిక్షణతరగతులు

తిరువూరు: స్థానిక ఒకటో శ్రేణి శాఖా గ్రంథాలయంలో ఈ నెల ఎనిమిదో తేదీ నుంచి ఉచిత వేసవి శిక్షణ తరగతులు ప్రారంభిస్తున్నట్లు గ్రంథాలయాధికారి కె.పద్మావతి తెలిపారు. చిత్రలేఖనం, తెలుగు, గణితం, సైన్స్, జనరల్ నాలెడ్జ్, స్పోకెన్ ఇంగ్లిష్, బొమ్మల తయారీ, మెడిటేషన్ తదితర అంశాల్లో శిక్షణ ఇస్తామన్నారు. రోజూ ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం వరకు ఈ తరగతులు కొనసాగుతాయని తెలిపారు. 10 నుంచి 15 ఏళ్ల లోపు విద్యార్థులు పాల్గొనాలని సూచించారు.



తిరువూరులో వేసవి శిక్షణ కరపత్రాల ఆవిష్కరణ

ఉల్లాసంగా.. ఉత్సాహంగా

తిరువూరు: తిరువూరు ఐడియాస్ సేవాసంస్థలో వేసవి శిక్షణా శిబిరంలో గురువారం బాలబాలికలు ఆటపాటలతో ఉల్లాసంగా గడిపారు. డ్యాన్స్, మ్యూజికల్ చైర్స్, గన్‌షాట్స్, బాస్కెట్ బాల్ పోటీల్లో పాల్గొన్నారు. మెదడుకు పదును పెట్టే పజిల్స్, సుడోకు తదితర గేమ్స్ కూడా విద్యార్థులకు నేర్పుతున్నట్లు ఐడియాస్ డైరెక్టర్ అవ్వారి శౌరి తెలిపారు.

నెమలి దేవస్థానం సహాయ కమిషనర్‌గా వరప్రసాద్

నెమలి(గంపలగూడెం): జిల్లాలో ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన గంపలగూడెం మండలం నెమలి శ్రీ వేణుగోపాలస్వామి దేవస్థానం ఎఫ్ఏసీ సహాయ కమిషనర్‌గా తిరుమలగిరి దేవస్థానం సహాయ కమిషనర్ ఎం.కె.టి.ఎన్.వరప్రసాద్ గురువారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు ఇక్కడ ఇన్‌చార్జిగా వ్యవహరించిన తిరుమలగిరి దేవస్థానం సహాయ కమిషనర్ డి.శ్రీరామ వరప్రసాదరావు అప్పనపల్లి దేవస్థానానికి బదిలీ అయ్యారు.

రుణాల రికవరీలో రైతుల తోడ్పాటు అభినందనీయం

తునికిపాడు(గంపలగూడెం): ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాల ద్వారా తీసుకున్న వ్యవసాయ రుణాలను సకాలంలో చెల్లించే విషయంలో రైతుల నుంచి అందుతున్న తోడ్పాటు, సహకారం అభినందనీయమని గంపలగూడెం కేడీసీసీ బ్యాంకు చీఫ్ మేనేజర్ శ్రీనివాసరావు అన్నారు. తునికిపాడు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంలో మెంబర్ లెవెల్లో 2022–23 ఆర్థిక సంవత్సరానికి 456 మంది రైతులు రూ.7.72 కోట్ల రుణాలను నూరు శాతం చెల్లించడంపై ఆయన అభినందించారు. ఈ సందర్భంగా బ్యాంకులో నిర్వహించిన కార్యక్రమంలో సొసైటీ అధ్యక్షుడు వేల్పుల చిన్న పిచ్చియ్య, సీఈఓ పి.మోహన్‌రావులను అభినందించారు. సొసైటీ వరుసగా ఆరో ఏడాది నూరు శాతం రుణాలు వసూలు చేశారని చీఫ్ మేనేజర్ కొనియాడారు. రైతుల నుంచి రుణాలను వసూలు చేయడంతో పాటు కోరిన వారికి తిరిగి 15 రోజుల్లో రుణాలు మంజూరు చేస్తామన్నారు. సొసైటీ అధ్యక్షుడు వేల్పుల చిన్న పిచ్చియ్య మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అందజేస్తున్న చేయూత కారణంగా రైతులకు మేలు జరిగి సకాలంలో రుణాలు చెల్లించగలుగుతున్నారన్నారు. బ్యాంకు అధికారులు రైతులకు తిరిగి రుణాలను సకాలంలో అందజేయాలని సూచించారు. మేనేజర్ కంచర్ల కనకదుర్గ, సూపర్‌వైజర్ మల్లాది ఏసోబు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

రీ సర్వేను సమర్థవంతంగా నిర్వహించాలి

గంపలగూడెం: జగనన్న శాశ్వత భూ హక్కు - భూ రక్ష పథకంలో భాగంగా రెండో విడత ఎంపికైన గ్రామాల్లో భూ రీసర్వేను సిబ్బంది సమర్థవంతంగా నిర్వహించాలని తిరువూరు ఆర్డీఓ వై.వి.ప్రసన్నలక్ష్మి ఆదేశించారు. భూ రీసర్వేపై వీఆర్వోలు, సచివాలయ సర్వేయర్లుతో గురువారం గంపలగూడెం వైఎస్సార్ క్రాంతిపథం కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించారు. రెండో విడత భూ రీసర్వే ఎన్టీఆర్ జిల్లాలోనే గంపలగూడెం మండలం వెనుకబడి ఉందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిర్లక్ష్యం వహిస్తే వీఆర్వోలు, సర్వేయర్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సర్వే పట్ల కొందరు సిబ్బంది బాధ్యత రాహిత్యంగా వ్యవహరిస్తున్నారని, పరిస్థితి ఇలానే కొనసాగితే ప్రతి రోజు అందరితో వీడియోకాన్ఫరెన్స్ నిర్వహిస్తానని చెప్పారు.



గంపలగూడెంలో రీ సర్వేపై సూచనలిస్తున్న తిరువూరు ఆర్డీఓ ప్రసన్నలక్ష్మి

నెలాఖరుకు ఎఫ్‌పీఓఎల్ఆర్ పూర్తి..

రెండో విడత గ్రామాల్లో గ్రౌండ్ ట్రూతింగ్‌కు ముందు ఎఫ్‌పీఓఎల్ఆర్‌ను ఏవిధమైన పొరబాట్లు లేకుండా నిబంధనల ప్రకారం పూర్తి చేయాలని ఆర్డీఓ ఆదేశించారు. అందుకు అవసరమైన పనులను ఆమె వివరించారు. ప్రభుత్వ భూములు ఆక్రమణలో ఉంటే వెంటనే స్వాధీనపర్చుకోవాలని సూచించారు. ఈవిషయమై ఎలాంటి అవకతవకలకు పాల్పడినా సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. డెత్ కేసులు, వారసత్వ ఆస్తి ఉంటే వారసులను ముందుగా గెట్లు వేసుకోమని సూచించాలన్నారు. ఇద్దరు రైతుల మధ్య ఉన్న గెట్ల తగాదాలు కూడా ఇప్పుడే పరిష్కరించి హద్దులు నిర్ణయించాలన్నారు. మాడిఫికేషన్, పీఓటీ, మ్యుటేషన్, సక్రమంగా పూర్తిచేయాలని సూచించారు. గ్రౌండ్ ట్రూతింగ్ ప్రారంభించిన తర్వాత ఎలాంటి సమస్యలు తలెత్తకుండా చూసుకోవాలన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఈనెలాఖరుకు ఎఫ్‌పీఓఎల్ఆర్ పూర్తి చేయాలని ఆదేశించారు. తహసీల్దార్ బాలకృష్ణారెడ్డి, మండల సర్వేయర్ సాంబశివరావు పాల్గొన్నారు.

గ్రామాల్లో ముమ్మరంగా రీ సర్వే

ముష్టికుంట్ల(తిరువూరు): జగనన్న భూహక్కు సర్వే పనులు మండలంలోని ముష్టికుంట్లలో వేగవంతంగా జరుగుతున్నాయి. సర్వే పూర్తయిన పొలాల్లో సరిహద్దు రాళ్ల ఏర్పాటును రెవెన్యూ శాఖ చేపట్టింది. తహసీల్దార్ సురేష్‌బాబు గురువారం సర్వే పనులను తనిఖీ చేశారు. పారదర్శకంగా సర్వే చేయాలని, రైతుల సమక్షంలోనే సరిహద్దు రాళ్లు పాతాలని సిబ్బందికి సూచించారు. డెప్యూటీ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ సర్వే సారంగపాణి, మండల సర్వేయర్ గోపాలకృష్ణ, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ గంధం పుల్లయ్య, వీఆర్వోలు, గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.

కనుల పండువగా నరసింహుని కల్యాణోత్సవాలు



కళాకారుల నృత్య ప్రదర్శన



అన్నసంతర్పణ చేస్తున్న కేసీపీ యాజమాన్యం

వేదాద్రి(జగ్గయ్యపేట): గ్రామంలో వేంచేసిన యోగానంద లక్ష్మీనరసింహ స్వామి తిరుకల్యాణ మహోత్సవాలు ఐదు రోజులుగా కనుల పండువగా జరుగుతున్నాయి. గురువారం బాలాత్రిపుర సుందరి ట్రస్ట్ ఆధ్వర్యంలో అర్చకులు పరాంకుశం వాసుదేవాచార్యులు, వేదాంతం శ్రీధరాచార్యులు స్వామికి స్వర్ణాలంకారం చేసి పూజలు నిర్వహించారు. దీక్షా స్వాములు గ్రామ సంకీర్తన చేసి ఇరుముడి సమర్పించేందుకు తరలివచ్చారు. కల్యాణోత్సవాల సందర్భంగా ఆలయాన్ని విద్యుత్ దీపాలతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. కూచిపూడి, భరతనాట్యంతో పాటు వరంగల్‌కు చెందిన విష్ణు ఆధ్వర్యంలో రేలారే రేలా జానపద కళాకారులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కేసీపీ ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగ, మంచినీరు పంపిణీచేశారు. భక్తులకు అన్నసమారాధన నిర్వహించారు. ఆలయ ఈఓ నాగరాజు, కేసీపీ ప్రతినిధి రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

రసాయనాలు వాడితే కఠిన చర్యలు

జగ్గయ్యపేట అర్బన్: మామిడి, అరటి, సపోట తదితర కాయలను రసాయనాలను ఉపయోగించి పక్వానికి తీసుకొచ్చి ప్రజలకు విక్రయించే వారిపై కఠిన చర్యలు తప్పవని మునిసిపల్ కమిషనర్ సీహెచ్.మల్లేశ్వరరావు హెచ్చరించారు. పట్టణంలోని పలు హోల్ సేల్, రిటైల్ పండ్ల దుకాణాలను మునిసిపల్ కమిషనర్ మల్లేశ్వరరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్, సచివాలయ కార్యదర్శులతో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజారోగ్యం దృష్ట్యా మామిడి, ఇతర పండ్లను కార్బైడ్, ఇతరత్రా రసాయనాలను ఉపయోగించి కృత్రిమంగా పండేసి ప్రజలకు విక్రయించరాదని హెచ్చరించారు. పండ్ల వ్యాపారం చేసే హోల్ సేల్, రిటైల్ వ్యాపారులు, నిల్వచేసేవారు కార్బైడ్, ఇతరత్రా రసాయనాలు వాడొద్దని సూచించారు. రసాయనాలను వినియోగించినట్లు తేలితే ఆహార భద్రత చట్టం నియమనిబంధనలను అనుసరించి చర్యలు తీసుకుంటామని స్పష్టంచేశారు.



హోల్‌సేల్ పండ్ల దుకాణాలను తనిఖీ చేస్తున్న మునిసిపల్ కమిషనర్ మల్లేశ్వరరావు

వైభవంగా లక్ష్మీనరసింహస్వామి కల్యాణం

పెనుగంచిప్రోలు: గ్రామంలో వేంచేసి ఉన్న శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దత్తత ఆలయమైన శ్రీధర్మపురి యోగానంద లక్ష్మీనరసింహస్వామి వారి ఆలయంలో గురువారం రాత్రి స్వామివారు, అమ్మవార్ల కల్యాణం అత్యంత వైభవంగా జరిగింది. అందంగా అలంకరించిన మండపంపై స్వామివారు, అమ్మవార్ల విగ్రహాలను ప్రతిష్ఠించి ఆలయ ప్రధానార్చకుడు పరాంకుశం రంగాచార్యులు ఆధ్వర్యంలో వేద మంత్రోచ్చరణ, మంగళవాయిద్యాల నడుమ కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. కల్యాణ పీటలపై శ్రీతిరుపతమ్మ ఆలయ చైర్మన్ ఇంజం చెన్నకేశవరావు దంపతులు, వంశ పారంపర్య ధర్మకర్తలు, పలువురు దంపతులు కూర్చొన్నారు. కల్యాణానికి ఆలయ ఈఓ కె.రమేష్‌నాయుడు పట్టువస్త్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ ఆలయ అధికారులు, పాలకవర్గ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



స్వామివారి కల్యాణంలో పాల్గొన్న తిరుపతమ్మ ఆలయ ఈఓ, చైర్మన్

నేడు గౌతమ బుద్ధుడి జయంతి

జగ్గయ్యపేట అర్బన్: గౌతమ బుద్ధుడి జయంతి వేడుకలను పట్టణంలో ధనంబోడుపై శుక్రవారం నిర్వహిస్తామని బౌద్ధ ఉపాసకుడు మోత్రపు అమృత నాగభూషణం గురువారం తెలిపారు. స్థానిక ఊర చెరువు పై భాగాన ఉన్న ధనంబోడుపై ఉన్న బౌద్ధ స్థూపం వద్ద ఉదయం జయంతి వేడుకలు జరుగుతాయని పేర్కొన్నారు. పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరుకావాలని కోరారు.